క్లుప్తంగా

చర్చిల్లో వెలంపల్లి ప్రత్యేక ప్రార్థనలు



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 61, 62వ డివిజన్‌లలోని పలు చర్చిల్లో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని ప్రజలు ఏసుక్రీస్తు ప్రభువు ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రార్థనల్లో వెలంపల్లితో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఆదివారం వాంబేకాలనీ హెచ్‌బ్లాక్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే మళ్లీ సీఎం జగనన్న గెలుపొందాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ అన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్ఎస్ నాయుడు, దుర్గాప్రసాద్‌రెడ్డి, పలువురు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం దుర్గాదేవి మందిరం సమీపంలో ఆదివారం ఇమేజ్ లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఓగిరాల వెంకట శశిధర్ సహకారంతో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా దాత ఓగిరాల వెంకట శశిధర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారి కడుపు నింపాలని సామాజిక బాధ్యతగా అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం 200 మందికి భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఓగిరాల సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు వ్రతానికి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించిన భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు. ఆలయ అర్చకుడు చక్రవధానుల సీతారామాచార్యులు నేతృత్వంలో శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు.

భవానీపురంలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురం స్వాతీ రోడ్‌లో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించింది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, పాపులర్ షూమార్ట్ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ కలిసి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రామ్‌రాజ్ ధోతీలు, చొక్కాలు అత్యంత ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో స్థానం పొందిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో విక్రయాలను ప్రారంభించామని, శ్రీలంక, సింగపూర్, మలేషియా వంటి ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షించడానికి రామ్‌రాజ్ కొత్తగా యాంటీ–బ్యాక్టీరియల్ ధోతీలను ప్రవేశపెట్టిందన్నారు.

దేశానికే దిక్సూచిగా సీఎం జగన్ పాలన

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి
- సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో ప్రచార ర్యాలీ
- ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ అంటూ ధీమా వ్యక్తం చేసిన నేతలు
- అడుగడుగున అభిమానులు ఘన స్వాగతం



ర్యాలీగా వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో, ఇచ్చిన హామీలను ఎలా అమలు చేయాలో చేసి చూపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి రాజీవ్‌నగర్ వంగవీటి మోహనరంగా విగ్రహం వరకు ఆదివారం చేపట్టిన ఎన్నికల ప్రచార ర్యాలీ జైత్రయాత్రగా సాగింది. సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు వేలాదిగా తరలివచ్చి ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ నిరుపేద ప్రజల జీవితాలను మార్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అందించిన సంక్షేమ పథకాలు ప్రతిపేదవాడికీ ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. చంద్రబాబు కంటే మెరుగైన పాలనను జగన్ అందించారని తెలిపారు. గత టీడీపీ కన్నా ఏడు రెట్లు అధికంగా ఆరు లక్షల ఉద్యోగాలు ఇవ్వడం, చంద్రబాబు కన్నా ఇన్వెస్ట్‌మెంట్స్‌లో మూడు రెట్లు ఎక్కువ సాధించి దేశంలోనే రెండో స్థానంలో రాష్ట్రాన్ని నిలబెట్టడం, వ్యక్తిగత స్థూల ఆదాయం పెంచడం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందని పేర్కొన్నారు.

యూటర్న్ బాబును ఎవరూ నమ్మరు..

గతంలో 650 హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఈసారి 6,500 హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎంపీ కేశినేని నాని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పూటకో మాట మారుస్తాడని మొన్నటి వరకూ వలంటీర్లను తిట్టిన ఆయన ఇప్పుడు వలంటీర్ వ్యవస్థను పొగుడుతున్నాడని అన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తుంటే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చెప్పిన బాబు ఇప్పుడు ఏకంగా వాటికి పది రెట్లు అధికమైన సంక్షేమాన్ని ఇస్తానని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మేనిఫెస్టోను బీజేపీనే నమ్మడం లేదని, ఇక ప్రజలు ఎలా నమ్ముతారని నిలదీశారు.

ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్..

పూజకు పనికిరాని పువ్వు బొండా ఉమా అని ఎంపీ కేశినేని నాని ఎద్దేవా చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడైన వ్యక్తి ఇల్లు కట్టుకుంటానంటేనే అతని దగ్గర మూడు లక్షల రూపాయాలు లంచం తీసుకున్న దుర్మార్గుడు బొండా ఉమా అని ఆరోపించారు. కబ్జాదారుడు, అసమర్థుడు, అవినీతిపరుడైన బొండా ఉమాకు సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారన్నారు. విజయవాడ నగరంలోని మూడు సీట్లతో కలిసి జిల్లాలోని ఏడుకు ఏడు సీట్లను వైఎస్సార్ సీపీ సాధించి తీరుతుందని ఎంపీ కేశినేని నాని తెలిపారు. సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, తప్పకుండా జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాపాలనకు ప్రజలు పట్టం కట్టడం తథ్యం: ఎమ్మెల్యే వెలంపల్లి



ర్యాలీలో పాదయాత్రగా వస్తున్న వెలంపల్లి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తదితరులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేద ప్రజలంతా చాలా సంతోషంగా జీవిస్తున్నారని, వారి జీవన విధానాలు మార్చేలా చారిత్రాత్మక పాలన అందించిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ నగర అభివృద్ధికి అసలైన నిర్వచనం చెప్పింది సీఎం జగనన్నే అని, దశాబ్దాలుగా పేరుకుపోయిన ఇంటి పట్టాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు, చెత్త డంపింగ్ యార్డ్ సమస్యలు వంటి ఎన్నో వాటికి ఆయన శాశ్వత పరిష్కారం చూపారని గుర్తుచేశారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని దోచుకుతున్న బొండా ఉమాను ప్రజలు తరిమికొట్టడం తథ్యమని అన్నారు. గూండాగిరి, సెక్స్‌రాకెట్, కాల్‌మనీ, భూకబ్జాదారుడైన బొండా ఉమాకు మళ్లీ ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతం రెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, కుక్కల అనిత, పెనుమత్స శిరీష, ఉద్దంటి సునీత, ఇసరపు దేవి, ఎండీ షాహినాసుల్తానా, ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు, కోఆప్షన్ సభ్యులు అలీమ్, నందెపు జగదీష్, వక్ఫ్‌బోర్డ్ డైరక్టర్ షేక్ కాజా, వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీను, అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ హాఫీజుల్లా, మల్లెల చెన్నకేశవరెడ్డి, బెజ్జం రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్ రావాలి



24వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్(నాని), వెలంపల్లి శ్రీనివాసరావుల విజయాన్ని కాంక్షిస్తూ అనిత కస్తూరిబాయిపేట, సీతారామపురంలో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జగనన్న ప్రభుత్వంలో డివిజన్‌లో చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు, అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్ము చంటి, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం ఆ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మంచి మనసు ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే వెంకటేశ్వరరావు, విజయ్, గోవిందు, సాయి పాల్గొన్నారు.

జగనన్నతోనే సర్వతోముఖాభివృద్ధి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



58వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



కర్రసాము చేస్తున్న వెలంపల్లి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి అభివృద్ధి, సంక్షేమానికి బాసటగా నిలవాలని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తిచేశారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో ఆయన గడప గడపకు వెళ్లి నవరత్నాలతో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ నూతన మేనిఫెస్టోను తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోకుండా అందినకాడికి దోచుకున్న బొండా ఉమాకు ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. 32వ డివిజన్‌ను కోట్లాది రూపాయల వ్యయంతో మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ ఆరోగ్య కేంద్రం, మానసిక ఆరోగ్య ఉల్లాసం కోసం ఉద్యానవనం, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామని అన్నారు. అంతేకాకుండా ఎస్సీ కల్యాణ మండపం నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందాలన్నా, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు.

అబద్ధాల చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలి..

మోసం, అబద్ధాల చంద్రబాబుకు సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అమలు సాధ్యంకాని హామీలతో నోటికి వచ్చినట్లు అధికారమే పరమావధిగా మాట్లాడుతున్న చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చిలలో ప్రార్థనలు..

అయోధ్యనగర్, బసవతారకనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిలలో వెలంపల్లి శ్రీనివాసరావు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మెరుగైన సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 58వ డివిజన్‌లోని నందమూరినగర్ బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఆయన ఓట్లు అభ్యర్థించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరించారు. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ లైట్లు వంటి అన్ని మౌలిక వసతులను కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మన ప్రాంతాలు మరింత అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వాకర్స్‌తో కాసేపు వాకింగ్ చేస్తూ గడిపారు. పక్కనే కర్రసాము నేర్చుకుంటున్న విద్యార్థుల వద్దకు వెళ్లి ఆయన కూడా కర్రసాము చేసి అందరిని ఆశ్చర్యపరిచారు. అక్కడి నుంచి క్రికెట్, హాకీ నేర్చుకుంటున్న చిన్నారుల వద్దకు వెళ్లి వారితో కాసేపు ఆయా క్రీడలను ఆడి అబ్బురపరిచారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకుడు అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయత వైఎస్సార్ సీపీ సొంతం



మధురానగర్ ఆర్‌యూబీని పరిశీలిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని, చెప్పామంటే ఖచ్చితంగా చేసే విశ్వసనీయత వైఎస్సార్ సీపీ సొంతమని సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మధురానగర్ ఆర్‌యూబీని ఆదివారం స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌యూబీ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు డివిజన్ వాసుల చిరకాల కోరికగా మిగిలిన ఆర్‌యూబీని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆర్‌యూబీ వల్ల రైల్వే గేటు కష్టాలు తప్పడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉందన్నారు. ఆర్‌యూబీతో సెంట్రల్ నియోజకవర్గంలో రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా మారిందన్నారు. తాము ప్రజలకు ఏది అవసరమో గుర్తించి వాటిని పూర్తిచేసేందుకు పనిచేస్తున్నామని చెప్పారు. టీడీపీ నేతలు ప్రచార ఆర్భాటాలకే పరిమితం అని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం మధురానగర్ ఆర్‌యూబీని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చామని అలాగే మధురానగర్ వాసులు ఎంతో కాలంగా కోరుతున్న కర్మల భవనం కూడా నిర్మించామని గుర్తుచేశారు. మధురానగర్ సమగ్ర అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజల ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు జగనన్న సహకారంతో శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం మధురానగర్, పసుపుతోట, కొబ్బరితోట, వీవీనరసరాజు రోడ్డు తదితర ప్రాంతాల్లోని చర్చిలలో ఆదివారం విశ్వాసకులతో కలిసి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రార్థనలు చేశారు.

సజావుగా పోస్టల్ బ్యాలెట్





విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కేంద్రానికి తరలివచ్చి ఓటు వేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సైతం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే అవకాశం పొందారు. కలెక్టర్ ఢిల్లీరావు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఘనంగా స్వరలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రథమ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న గోళ్ల నారాయణరావు, వేదికమీద ప్రభాకర్, గాయకులు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహిత్యపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. సంస్థ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గాయనీగాయకులకు వేదిక కల్పించి వారిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. స్వరలయ బృంద గాయకులు క్లాసికల్ గీతాలను మధురంగా ఆలపించారు. ఉదయం జరిగిన చిత్రలేఖనం పోటీ విజేతలకు, సినీ సంగీత కార్యక్రమంలో పాల్గొన్న గాయకులకు, నృత్య కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు, వరల్డ్ రికార్డ్ విజేత గాయని ఋుగ్వేదం పద్మశ్రీకి హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ చేతులమీదగా బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు మోహన్ రాం ప్రసాద్, రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్, నాగలక్ష్మి, మిస్ విజయవాడ(2015) శ్రీసత్య పాల్గొన్నారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి

కంకిపాడు: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన ముగడ గంగులు కుటుంబం జీవిస్తోంది. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గంగులుకు కుమారుడు, కుమార్తె సంతానం కలరు. కుమారుడు లోకేష్(17) ఉయ్యూరులోని ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్ విద్యనభ్యసించాడు. సెలవులు కావడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నెల 4న గంగులు తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో లోకేష్ తన తండ్రికి ఫోన్ చేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని పాము కాటు వేసిందని చెప్పాడు. వెంటనే గంగులు ఇంటికీ వచ్చి లోకేష్‌ను వైద్యం నిమిత్తం కంకిపాడు సీహెచ్‌సీకి తీసుకొచ్చాడు. మెరుగైన వైద్యం నిమిత్తం అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున లోకేష్ మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

యనమలకుదురులో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ మహానందీశ్వర స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో అర్చన జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు నృత్యకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కళ్యాణి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు కళావేదిక వద్దకు విచ్చేశారు. నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించడమే కాకుండా చిన్నారులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

